


## (క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

### 1998-డిసెంబర్

ఆశా, సూసీ, కోమలీ, భానూ మినర్వాలో కూర్చొని వున్నారు. మౌనంగా కాఫీ తాగుతూ, మాటలు లేని నిశ్శబ్దం భరిస్తూ వున్నారు. ఎప్పటిలా నవ్వులూ, హాస్యాలూ, కేరింతలూ ఏవీ లేవు. క్రిస్మస్ సెలవులని సూసీ, శివా ఆస్ట్రేలియా నుంచి వచ్చారు. వచ్చారే కానీ, ఆగస్టులో వెంకట్ మరణం మిగిల్చిన విషాదం వాళ్ళని ఇంకా చుట్టు ముట్టే వుంది.

"అశోక్ దుఃఖం పట్టలేకుండా వున్నాడు.అందులోనూ, వెంకట్‌తో కనీసం ఫోనులో మాట్లాడి ఆరు నెలలకి పైగా అయిపోయింది. ఎవరి బ్రతుకుల్లో వాళ్ళం ఎంత బిజీగా, చిక్కుకోని పోతాం కదా! ఆరు నెలలుగా దగ్గరి స్నేహితుడితో మాట్లాడలేనంత తీరిక లేకుండా ఎలా మారిపోయాం! ఇవన్నీ ఆలోచిస్తూ నిద్ర పోవడం లేదు, చాలా గిల్టీగా, తనని తనే మానసికంగా హింసించుకుంటూ వున్నాడు."

భానూ చేతి మీద చేయి వేసి నొక్కింది ఆశా.

"ఎన్నో నెల? వెంకట్‌కి చెప్పావా"

ఆశ్చర్యంగా చూసింది భాను.

"తెలుస్తోందా?"

నవ్వింది ఆశ.

"అంతగా లేదు, కానీ కొంచెం తెలుస్తోంది. అశోక్ ఈ వార్త విని సంతోషించలేదూ?"

"ఇంకా చెప్పలేదు. నాలుగో నెల వచ్చింది. మా వెడ్డింగ్ ఏనివర్సరీ రోజు చెప్తాను. ఆగస్టులో వెంకట్ పోయిన రెండు వారాలకి డాక్టర్ దగ్గరికెళ్ళి కన్‌ఫర్మ్ చేసుకున్నాను. కానీ అశోక్ మూడ్ చూసి చెప్పలేదు. ఇప్పుడేమో, చెప్పాలంటే భయం వేస్తుంది. ఇన్నిరోజులు చెప్పనందుకు నొచ్చుకుంటాడేమోనని! అత్తయ్యతో చెప్పాను. సంతోషించారు."

"ఆలస్యం చేయకుండా అశోక్‌తో చెప్పు."

"ఇలాటి వార్త శివాతో చెప్పాలని నేనెంత ఎదురు చూసినా ఆశ తీరడంలేదు," సూసీ తరవాత ఇంటికెళ్ళే దారిలో కోమలితో చెప్పింది బాధగా.

"డాక్టరుకి చూపించుకున్నావా?"

"అన్నీ అయినాయి. మా తలరాతే బాలేదు. కొన్నిసార్లు నాకు మా అమ్మా వాళ్ళదీ, శివా వాళ్ళ అమ్మా నాన్నలదీ ఉసురు తగిలిందేమో అనిపిస్తుంది!"

"ఛ! అవేం మాటలు! పెద్దవాళ్ళ కోపం ఎప్పుడూ మనకి కష్టం కలిగించదు."

కన్నీళ్ళతో నవ్వింది సూసీ.

## 1999-జూన్

"అశోక్, నీకే ఫోన్!" ఫాకల్టీ రూములో కూర్చొని రాసుకుంటున్న అశోక్ తలెత్తాడు.

"అశోక్, కంగ్రాట్స్. భాను ప్రసవించింది. మగబిడ్డ. ఇందాకే అమ్మకి ఫోన్ చేసాను ఇంటికెళ్ళి అమూల్యనీ, అమ్మనీ తీసుకొని హాస్పిటల్కి వచ్చేయండి. మా ఇంటి దగ్గరే, అనూష నర్సింగ్‌హోం!" పద్మనాభం సంతోషంగా చెప్తూనే వున్నాడు, అశోక్ ఫోన్ పెట్టేసి బయటికి పరిగెత్తాడు. దారిలో పుల్లారెడ్డి స్వీట్ బాక్సు కొనుక్కొని, ఇంటికెళ్ళి కాలింగ్ బెల్లు కొట్టిన తరవాత కానీ ఊపిరి పీల్చుకోలేదు.

వెలిగిపోతున్న మొహంతో సుమిత్ర తలుపు తెరిచింది. కొడుకుని కౌగలించుకోని సంతోషంగా ముద్దు పెట్టింది.

"అమ్మూ కూడా బాంక్ నుంచి లీవు పెట్టి బయట పడింది. అది రాగానే బయల్దేరుదాం," బాగులో ఏదో సామను సర్దుతూ చెప్పింది.

"ఏమిటమ్మా? ఏదో సామాను సర్దుతున్నావు?"

"అదా, ఏమీలేదురా. బుజ్జిగాడి కోసం ఒక చిన్న గొలుసూ, చేతికి మురుగులూ, కాళ్ళకి వెండి కడియలూ చేయించాను. చూడు, బాగున్నాయా?"

"ఎప్పుడు చేయించావు? నీదగ్గర డబ్బెక్కడిది?"

"అదేంట్రా? మరీ మనవడికి చిన్న సామాను కూడా కొనలేనా? నా జీతం అలాగే వుంది కదా, దాంతో చేయించా."

అశోక్ ఏమీ మాట్లాడలేదు.

బుజ్జి బాబు బారసాల వేడుకగా జరిగింది.

" భార్గవ రాం ", పేరు బియ్యంలో రాసాడు అశోక్. తండ్రి పేరు, రాం ప్రసాద్ కలిసొచ్చేలా పెట్టాడు.

"ఎంత అందంగా వున్నావో తెలుసా?" భార్య చెంపల మీద చేత్తో రాస్తూ అన్నాడు అశోక్.

"అవునా? థాంక్స్! ఆఫీసు లేదు, ఇంకే పనీ పాటా లేదు, లావైపోతున్నాను. అది సరే కానీ ,అశోక్, నేను ఇంకో నెలరోజులు అమ్మా వాళ్ళ ఇంట్లో వుండి అప్పుడు మన ఇంటికొస్తాను, సరేనా?"

"అబ్బా! ఇంకా ఒక నెలరోజులా? అప్పుడే బుజ్జిగాడు పుట్టి ఇరవై రోజులపైనే అయింది. వాణ్ణొదిలి ఇంకో నెలరోజులుండాలా? నువ్వుండు మీ అమ్మా నాన్నల దగ్గర వుండు. వీణ్ణి నేను తీసికెళ్ళిపోతాను!"

నవ్వింది భాను.

"నాకు ఇంకా వాడికి స్నానం చేయించడం రావడంలేదు. అమ్మ దగ్గర ఇంకొన్ని రోజులుండి."

"ఊ..సరేలే!"

★★★★★★★★★

"మీ అత్తగారు ఏంటే, మరీ ఇంత సన్నటి గొలుసు తెచ్చింది మనవడికోసం! నీకన్నా ఏమన్నా కొన్నారా?"

"అమ్మా, నీకెందుకే! ఏదో వీలైంది ఇచ్చారు  ఆవిడ. ఇప్పుడీ పసి వాడికి నగలు కావాల్సొచ్చాయా?" బాబుని ముద్దు చేస్తూ అన్నది భాను.

"అంతేలే, ఇంకా నయం! మగపిల్లాడు కాబట్టి సరిపోయింది. అదే ఆడపిల్లైతే!"

"అమ్మా! ఇంకోసారెప్పుడూ ఆ మాటనొద్దు! నాకు చాలా కోపమొస్తుంది! ఆడపిల్లైనా, మగ పిల్లాడైనా, ఆరోగ్యంగా వుండాలి, చదువు వొంటబట్టాలి, తన కాళ్ళ మీద తాను నిలబడడం నేర్చుకోవాలి. అంతే కానీ, వీడేదో మగ పిల్లాడు కాబట్టి గొప్ప, అనే మాటలు మాట్లాడకు!" బాబునెత్తుకొని చిరాగ్గా వెళ్ళిపోయింది భాను. ఇంకో నెల రోజులుండి, జులైలో తమ ఇంటికెళ్ళి పోయింది భాను.

## 1999- ఆగస్టు

"అశోక్! ఈ శనివారం పెళ్ళి బట్టలు కొనడానికి రమ్మని సుధీర్ వాళ్ళమ్మా నాన్నా ఫోన్ చేసారు. నువ్వూ, భానూ, అమ్మూ వెళ్ళి రండి."

"అదేంటి, మీరు రారా షాపింగుకి?" ఆశ్చర్యంగా అడిగింది భాను.

"వొద్దులే భానూ, సుధీర్ వాళ్ళమ్మకి నేను పెళ్ళి బట్టలు కొనడం పెద్దగా ఇష్టం వున్నట్టు లేదు!"

"ఆవిడకెందుకు ఇష్టం వుండదు? అమ్మూ పెళ్ళి చీర మీరు సెలెక్టు చేయకుండా ఎలా?"

"అవునమ్మా, అందరం వెళదాం!"

★★★★★★★★★★★★★★★

"అశోక్, షాపింగు వెళ్ళే ముందు మనం బడ్జెట్ జాగ్రత్తగా వేసుకుని వెళదాం."

"అలాగేలే. భానూ, ఈ పెళ్ళిలో నువ్వూ ఒక నగ కొనుక్కో. ”

"చూద్దాంలే అశోక్. నాకున్న నగలు చాలు. బడ్జెట్ దాటకుండా అమ్మూ పెళ్ళి షపింగ్ జరిగిపోతే చాలు."

"నువ్వు వర్రీ కాకు భానూ. నాన్న ఇన్స్యూరెన్స్ డబ్బులూ, తన సేవింగ్స్ అన్నీ అమ్మ దీనికోసమే దాచింది. అవి తీసి వాడేద్దాం."

"అవి సరిపోతాయో లేదో! మనం కూడా డబ్బులు రెడీగ వుంచుకుంటే మంచిది. సుధీర్ వాళ్ళ అమ్మా నాన్నల ఎక్స్పెక్టేషన్ కొంచెం ఎక్కువ అనిపిస్తుంది."

"అదీ నిజమేలే. కానీ, ఇంట్లో పెళ్ళికి నీకు ఏమీ కొనకుండా, నాకేం బాలేదు భానూ. ఏమైనా కొనటానికి తప్పక ప్రయత్నిస్తాను."

"సరే, చూద్దాంలే. ముందు పెళ్ళి షాపింగవనీ! పెళ్ళి మూడు నెలల్లో కొచ్చింది. "

"అది సరే భానూ! ఇంకో రెండు వారాల్లో నీ మెటర్నిటీ లీవు అయిపోతుంది. నువ్వు మళ్ళీ ఆఫీసుకెళ్ళాలి.  బాబుని మీ ఆఫీసులో క్రెష్‌లో వుంచుదామా? ఏం చేద్దాం?"

"ఆఫీసు క్రెష్ వొద్దు అశోక్. మన పనమ్మాయి చెల్లెలు నీలమణి పొద్దున ఎనిమిది నించీ సాయంత్రం నాలుగింటి వరకూ వుంటానంది. నాలుగింటికంతా అత్తయ్య వొచ్చేస్తారు. ఎలాగో మేనేజ్ చెయ్యొచ్చు."

★★★★★★★★★★★★★★★

## 1999-డిసెంబర్

"హమ్మయ్య! ఇప్పటికి కానీ బుజ్జిగాడు నిద్రపోలేదు. ఇవాళ చాలా అలసటగా వుంది అశోక్. రేపటినించి క్రిస్మస్ సెలవులు. హాయిగా న్యూ ఇయర్ వరకూ రెస్టు తీసుకోవచ్చు."

"అబ్బ, ఈ సంవత్సరం భలే తొందరగా గడిచిపోయింది. మన జీవితాల్లో ఎన్ని విషయాలు జరిగాయి! బుజ్జిగాడు పుట్టటం, అమ్మూ పెళ్ళి!"

"అమ్మూ పెళ్ళి అయి వెళ్ళింతరవాత ఇల్లు చిన్నబోయింది. అత్తయ్య కూడా పాపం డల్ అయ్యారు. ఈ మధ్య మోకాళ్ళల్లో నొప్పి అన్నారు. వీలైతే రేపు కొంచెం డాక్టరు దగ్గరికి తీసికెళ్ళు."

"నేనసలు అమ్మ రిటైర్ అయిపోతే బాగుంటుందనుకుంటున్నా. మోకాళ్ళ నొప్పితో కాలేజీకి వెళ్ళలేకపోతూంది ఈ మధ్య. "

"మంచి ఆలోచనే కానీ, ఆవిడేమంటారో! రిటైర్ అయి ఇంట్లో బోర్ కొడుతుందనుకుంటారేమో. అడిగి చూడు. తరవాత అత్తయ్య ఇష్టం."

"అమ్మ ఇంట్లో వుంటే నీక్కూడా కొంచెం రెస్టు వుంటుంది భానూ. అమ్మ ఇంట్లో వుంటే, మనం నీలమణి పైన ఇంత ఆధారపడక్కర్లేదు. నీలమణి రానప్పుడల్లా, ఎంత ఇబ్బంది పడ్డాం మనం! "

"అవుననుకో, కానీ, మనం పిల్లాడి కోసం తనని రిటైర్ అవమంటున్నామనుకుంటారేమో అత్తయ్య."

"ఛ! అమ్మ ఎప్పుడు అలాగనుకోదు. అయినా అమ్మని రిటైర్ అవమని మనమేం బలవంతం చేయడంలేదు. వూరికే సజెస్ట్ చేస్తాం. ఆ తరవాత ఆమె ఇష్టం."

"సరేలే అశోక్, నీకెలా అనిపిస్తే అలా చేయి."

"ప్రతీ సంవత్సరం డిసెంబరులో నేను చదివిన పుస్తకాల లెక్క చూసుకుంటాను. ఈ యేడు అసలేమీ పుస్తకాలు చదవలేదు భానూ!"

"అవునా? మరీ బిజీగా అయిపోతున్నామా? నాకైతే ఆఫీసు పనీ, బుజ్జిగాడి పనీ తప్ప రోజులో ఇంకేమీ వున్నట్టనిపించటం లేదు.బాడ్‌మింటన్ అయితే మొత్తానికే అటకెక్కింది. ఈ సంవత్సరం మా ఆఫీసు టీంలో కూడా నాకు చోటు దక్కలేదు. అసలు దక్కినా కూడా, నేను బుజ్జిగాణ్ణొదొలి ప్రాక్టీసుకెళ్ళగలిగేదాన్నా? అందుకే పెద్దగా పట్టించుకోలేదు. బాడ్‌మింటన్ అంటే గుర్తొచ్చింది. పుల్లెల గోపీచంద్ అర్జునా అవార్డు గెల్చుకున్నాడు. కిందటేడు కామన్‌వెల్త్ పోటీల్లో మెడల్సు కూడా తెచ్చాడు."

"నెక్స్ట్ ఇయర్ తప్పకుండా ప్రాక్టీస్ చేయి భానూ! ఇప్పుడైతే బుజ్జిగాడు చూడు, నిద్దట్లో ఎంత ముద్దుగా నవ్వుతున్నాడో!"

"అసలు మనం వీణ్ణిక బుజ్జిగాడని పిలవొద్దు అశోక్. భార్గవ్ అని అందమైన పేరు పెట్టాం! ఆ పేరుతోనే పిలవాలి."

"యస్ మేడం!

★★★★★★★★★

"ఇంకా నాలుగేళ్ళ సర్వీసుంది అశోక్. ఇప్పణ్ణించి రిటైర్ అయి ఇంట్లో చేసేదేముంది. అందులోనూ అమ్మూ పెళ్ళికి కొంచెం అప్పు చేసాం. అది తీర్చాలి. పైగా ఇక ముందంతా మనకి బోలెడు ఖర్చులు. నా జీతం లేకుండా ఇప్పణ్ణించీ ఎందుకు?"

సుమిత్ర మాటలు విని ఆలోచనలో పడ్డాడు అశోక్. ఆమె చెప్పేదీ నిజమే. డబ్బుకి పెద్ద ఇబ్బందేమీ పడటం లేదు ప్రస్తుతానికి. కానీ, అమ్మూ పెళ్ళికి అనుకున్నదానికన్న చాలా ఎక్కువ ఖర్చైంది. తండ్రి ఇన్స్యూరెన్సు డబ్బూ, తల్లి దాచిన డబ్బూ రెండూ కలిపినా సరిపోలేదు. అమూల్య మనసు పాడు చేయడం ఇష్టం లేక తామెవరూ ఆమెతో డబ్బు సంగతి చెప్పలేదు. అమ్మ చెప్పినట్టు ముందు ముందు అమూల్య పెట్టుపోతలూ, తమకి పుట్టే బిడ్డల ఖర్చూ పెరగబోతూనే వుంది. ఎక్కువ సెలవు పెడితే జీతం రాదని పాపం భాను లీవు పెట్టకుండా ఆఫీసులో చేరిపోయింది. నిట్టూర్చాడు అశోక్.

"సరే అమ్మా! శనివారం ముందు డాక్టరు దగ్గరకెళ్దాం. ముందా మోకాళ్ళ నొప్పి చూపించాలి."

## 2000-జూన్

"అంత బక్కపడ్డావు అమ్మూ! అంతా బాగానే వున్నారు కదా?"

భార్గవ్ మొదటి పుట్టినరోజని పుట్టింటికొచ్చిన అమూల్యని పరీక్షగా చూస్తూ అన్నది భాను.

"ఏం లేదొదినా! ఆ మధ్య కొంచెం సుస్తీ చేసింది. అంతే!" తిరిగి రెట్టించలేదు భాను, కానీ అమూల్య తన వైపు చూడకుండ మాట్లాడుతోందన్న విషయం గమనించకపోలేదు.

"అశోక్! నాకేదో అనుమానంగా వుంది. అమ్మూ ఇంట్లో అంత సరిగా వున్నట్టు లేదు. అసలు తన సంసారం కబుర్లేమీ చెప్పదు. నేనేదైనా ప్రస్తావన తెస్తే నవ్వేసి దాటేస్తుంది. బాగా చిక్కిపోయింది. నువ్వొకసారి అడుగు, ప్లీజ్!"

"అడుగుతా కానీ, నీకూ అమ్మకీ చెప్పని విషయాలు నాతో చెప్తుందా?"

"బుద్ధుందా నీకసలు? ఆ మాత్రం చెల్లెలి మనసు తెలుసుకునే ప్రయత్నం చేయవా?"

అశోక్ మాట్లడకుండ వుండిపోయాడు. ఏమనాలో తోచలేదతనికి. భాను మళ్ళీ తనే అంది.

"సరే, ఒక పని చేద్దాం. వూరికే బెంగుళూరు చూడ్డానికన్నట్టు వెళ్ళి వాళ్ళ ఇంట్లో వారం రోజులుందాం. అప్పుడు వాళ్ళెలా వున్నదీ మనకి కొంచెం అయిడియా వొస్తుంది, ఏమంటావ్?"

"వారం రోజులు నీకు లీవ్ దొరుకుతుందా?"

"ఏదో చేద్దాంలే. ముందు ఈ సమస్యేమిటో చూడాలి."

★★★★★★★★★★★

"అమ్మా! నువ్వు కంగారు పడనంటే నీకో విషయం చెప్తాను."

"ఏంట్రా అశోక్, ఏమయింది? బెంగుళూర్ వెళ్ళొచ్చిందగ్గరినించీ ఇద్దరూ దిగులుగా వున్నారు. ఏమయిందసలు? అమూల్య బానే వుంది కదా?" ఎంత అణచుకున్నా సుమిత్ర గొంతు వొణుకడం మొదలైంది.

"అత్తయ్యా! మీరు కొంచెం స్థిమిత పడండి. మాకిద్దరికీ ఎందుకో అమూల్య వాళ్ళ ఇంట్లో పద్ధతి ఏమీ నచ్చలేదు. అతను అనుమానం మనిషి. పిల్లని కదలనీయడం లేదు."

"కొడుతున్నాడా?"

"లేదు, కానీ, బాగా మాటలతో హింసిస్తున్నాడు. ఎంతో బతిలాడితేగానీ అమ్మూ సంగతంతా మాతో చెప్పలేదు. మేం వాళ్ళమ్మా నాన్నలని కూడా నిలదీసి అడిగాం. వాళ్ళు కూడా వాళ్ళ అబ్బాయిని పెద్దగా అదుపులో పెట్టలేక పోతున్నారు," చెప్పాడు అశోక్.

"ఇప్పుడేం చేద్దాం అశోక్?" సుమిత్ర బేలగ అడిగింది.

"ముందు అమ్మూని ఒక రెండు నెలలు సెలవు పెట్టి ఇంటికి రమ్మని చెప్పాం. నాలుగు రోజులు స్థిమిత పడ్డాక అదే ఆలోచించుకుంటుంది."

"ఇందులో ఆలోచించడానికేముంది భానూ! ఎలాగో సర్దుకోవాలి. సంసారం పాడు చేసుకునే సలహాలివ్వకండి దానికి మీరిద్దరూ!"

"అమ్మా! ఇప్పుడు మనమెవ్వరం ఈ విషయం ఏమీ మట్లాడొద్దు అమ్మూ తో. కొద్దిరోజులు పోనీ! ముందు దాని మనసు కుదుట పడాలి. ఆ తరవాతే యే ఆలోచనలైనా, మాటలైనా. "

తల్లితో అనునయంగానే అన్నా, అశోక్ గొంతు దృఢంగా పలికింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS